PRGI NO: TGTEL/26/A1984

VISION PRABHA

# విజన్ ప్రభ

తెలుగు దినపత్రిక

Cell N: 98661 88619

Published from : హైదరాబాద్. సూర్యాపేట. విజయవాడ.

ఆదివారం ఆగస్ట్ 23, 2026 | ఎడిటర్. తూనం.వెంకటేశ్వర రావు. | సంపుటి:1 సంచిక:147 | పేజీలు 4 | వెల-2



## రేవంత్ పర్యటనను కావాలనే అడ్డుకున్నారు!

- సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై ఖర్గే ఆగ్రహం.
- కేంద్రం కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుందని ఆరోపణ.
- పర్యటనల ప్రధాన ఉద్దేశం పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే అని వ్యాఖ్య.
- విదేశీ పెట్టుబడులతో రాష్ట్రంతో పాటు దేశానికీ ప్రయోజనమని వెల్లడి.
- ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు రాజకీయాలకు అతీతంగా అనుమతులు ఇవ్వాలని సూచన.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. పెట్టుబడులను ఆకర్షించడమే ఇటువంటి పర్యటనల ముఖ్య ఉద్దేశమని, వాటికి అనుమతి నిరాకరించడం అన్యాయమేనని మండిపడ్డారు. కేంద్రం కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుందని ఆరోపించారు."వారు తమకు నచ్చిన వారికి అనుమతి ఇస్తారు. కానీ, తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం ఇవ్వలేదు. అమెరికా లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఎంతోమంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ముఖ్యమంత్రులు అక్కడికి వెళ్లి.. తమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమలు స్థాపించాలని వారిని ఆహ్వానిస్తుంటారు. అదేవిధంగా.. పెట్టుబడులు పెట్టాలనుకునే వారు కూడా ఇటువంటి పర్యటనల సమయంలో ప్రభుత్వం నుంచి భూకేటాయింపులు, పన్ను రాయితీలను కోరుతుంటారు.అక్కడినుంచి పెట్టుబడులు వస్తే రాష్ట్రానికి, దేశానికే ప్రయోజనం. ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయి. రేవంత్ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం తప్పు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. పెట్టుబడులు దేశానికే కదా వస్తాయి" అని మీడియాతో మాట్లాడుతూ ఖర్గే పేర్కొన్నారు.

## భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ!

- భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కిషన్ రెడ్డి డిమాండ్.
- 22ఏ నిషేధిత భూముల పేరుతో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణ.
- ప్రైవేటు భూములను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ.
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై కమిషన్ల ఆరోపణలు.
- భూవివాదాలపై బీజేపీ లీగల్ సెల్ ప్రజలకు అండగా ఉంటుందని వెల్లడి.



హైదరాబాద్:
రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా?

## దౌత్యం అంటే టీ20లే కాదు.. టెస్టులూ ఉంటాయి!

- అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘ ప్రక్రియలు -- జైశంకర్.
- భౌగోళిక రాజకీయ సమస్యలకు సహనం, దీర్ఘకాలిక వ్యూహం అవసరం.
- పశ్చిమాసియా యుద్ధం టీ20 కాదు.. టెస్ట్ సిరీస్‌లా మారింది.
- అనిశ్చిత ప్రపంచంలో 'డి-రిస్కింగ్' కీలకమని సూచన.
- ఎక్కువ భాగస్వాములు, సరఫరా మార్గాలతో రిస్క్ తగ్గించుకోవాలని పిలుపు.



ఇంటర్నెట్ డెస్క్:
దౌత్యం, భౌగోళిక రాజకీయాలను ఎల్లప్పుడూ త్వరిత ఫలితాల దృష్టితో అంచనా వేయలేమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. కొన్ని అంతర్జాతీయ సవాళ్లకు సహనం, దీర్ఘకాలిక నిబద్ధత అవసరమని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్'ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత దౌత్యనీతి 'టీ20 క్రికెట్'ను పోలి ఉందా? అనే ప్రశ్నకు ఆయన ఈమేరకు స్పందించారు.

2 లో




## ఆరోగ్యం బాలేకపోతే.. చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు..! - రాజ్‌నాథ్‌సింగ్

ఇంటర్నెట్ డెస్క్:
అనారోగ్యానికి గురైతే వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇంటర్నెట్, చాట్‌జీపీటీ లో లక్షణాలను వెతికి.. తమకు ఫలానా వ్యాధి ఉందని నిర్ధారించుకోవద్దని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. అలా చూసుకునేవారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోందని తెలిపారు. శనివారం నోయిడాలో ఆయన మాట్లాడుతూ..




## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరి మృతి

హైదరాబాద్:
నగరంలో ఘోర ప్రమాద ఘటన చోటుచేసుకుంది. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. దీంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కూలిన భవన శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ మీద పడిపోయాయి.

2 లో



## అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం!

- అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తాం -- రంగనాథ్.
- నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఎవరినీ ఉపేక్షించం.
- నాలాల పక్కన 50 గజాల్లోనే ఏడంతస్తుల భవనాలు.
- కూలిన భవనం ఘటనలో ఇప్పటికే ఇద్దరి మృతి.
- చుట్టుపక్కల అక్రమ భవనాలపై త్వరలోనే చర్యలు.

2 లో




## కొండా సురేఖ సంచలన లేఖ!

- తనను, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపణ.
- ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్.
- విచారణ జరుగుతుండగానే తనపై విమర్శలు చేయడంపై అభ్యంతరం.
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా? పరిశీలించాలని కోరిన సురేఖ.
- తనపై జరుగుతున్న సామూహిక దాడులపై పార్టీ నాయకత్వం మౌనం వహించడంపై ఆవేదన.

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు. తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని కొందరు అవమానకరంగా వ్యాఖ్యలు చేయిస్తున్నారని, వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవికి విజ్ఞప్తి చేశారు.
టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తుండటంపై కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అన్నారు.

మిగతాద్ది 2 లో



## విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారు!

- సీఎం రేవంత్ విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశారంటూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ.
- రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేరని ఆరోపణ.
- 21,126 పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని వ్యాఖ్య.
- ఫీజు బకాయిలపై ఆగస్టు 24, 25న బీజేపీ దీక్షలు.

హైదరాబాద్:
రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ సర్కారు విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందని బీజేఎల్పీ నేత మహాఏశ్వర్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే రీయింబర్స్‌మెంట్ ఇస్తానన్న రేవంత్.. అది మరచి ఎలా దోచుకోవాలో చూస్తున్నారని మండిపడ్డారు. ఫీజు బకాయిలపై ఈనెల 24, 25 తేదీల్లో దీక్షలు చేస్తామని ఏలేటి హెచ్చరించారు. ఇక 22-ఏ బాధితులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు ఏలేటి.

మిగతాద్ది 2 లో



## కాంగ్రెస్ నోటీసుకు చిన్నారెడ్డి సమాధానం

- పార్టీ అధిష్ఠానానికి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్న చిన్నారెడ్డి.
- 40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తున్న నేతల బాధలనే చెప్పానని వివరణ.
- ఏఐసీసీ, టీపీసీసీ కార్యాలయాలను పవిత్ర దేవాలయాలుగా భావిస్తానని వ్యాఖ్య.
- పార్టీ అగ్రనేతలపై తనకు అపార గౌరవం ఉందని స్పష్టం.
- వ్యవహారాన్ని ఇంతటితో ముగించి షోకాజ్ నోటీసు ఉపసంహరించాలని విజ్ఞప్తి

మిగతాద్ది 2 లో



## రానున్న ఐదు రోజులు వర్షాలు.. వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్:
రాష్ట్రానికి వాతావరణ శాఖ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు నుంచి ఈ నెల 26 వరకూ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దానితో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాలలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది.

# గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరి మృతి

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రమాదంతో అక్కడున్న వాళ్లంతా భయంతో ఒక్కసారిగా పరుగులు తీశారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కాలువను ఆనుకుని ఉన్న కేవలం 50 గజాల స్థలంలో ఈ భవనం నిర్మించ తలపెట్టినట్లు తెలుస్తోంది. భవనం కూలిపోవడంతో శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా? అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభం అయ్యాయి. ఇటు ఈ భవన నిర్మాణానికి అసలు అనుమతులు ఉన్నాయా? అనేదానిపై అధికారులు స్పందించాల్సి ఉంది. ఈ భవనాన్ని హాస్టల్ కోసం నిర్మిస్తున్నట్లు సమాచారం.

# హైడ్రా రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కూలిన భవనాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.
అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇక ఎవరిని ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి. 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం. భవనాలు అన్ని నాలాను ఆనుకునే నిర్మించారు. బిల్డర్ సాజిద్ పరారీలో ఉన్నాడు. 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లకు ఇస్తున్నాడు" అని రంగనాథ్ తెలిపారు.
ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతి చెందాడు. బిల్డింగ్ యజమాని అందుబాటులోకి రాలేదు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు ఇచ్చారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల ఉన్న భవనాలను కూడా పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తాం. హాస్టల్ బిల్డింగులు నిర్మించి రెంట్‌కు ఇస్తుంటాడు సాజిద్.. అతనిపై ఇప్పటికే చాలా ఫిర్యాదులు ఉన్నాయి" అని రంగనాథ్ పేర్కొన్నారు.

# విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారు!

మొదటిపేజీ తరువాయి
(శనివారం, ఆగస్టు 22వ తేదీ) 'ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి' పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. మాట్లాడారు. ' విద్యార్థుల ఫీజు బకాయిల గురించి విద్యార్థుల సంతకాల సేకరణ, ఉద్యమాలు చేస్తుంది బీజేపీ. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేదు. పాఠశాలల్లో, యూనివర్సిటీలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే సీఎం విదేశీ పర్యటనలు చేస్తున్నారు.
21 వేల 126 బడులు శిథిలావస్తలో ఉన్నాయి. బంగారం అమ్ముకుని చదువులు చెప్పిస్తుంటే..ప్రభుత్వానికి పట్టడం లేదు. పీసీసీగా నువ్వు మాట్లాడిన మాటలేవి రేవంత్ రెడ్డి..?, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. 24, 25 తేదీలలో రెండు రోజుల పాటు రాష్ట్ర కార్యాలయం ముందు రాంచందర్ రావు ఆధ్వర్యంలో దీక్ష చేస్తాం. ప్రజల కోసం ప్రభుత్వం మెడలు వంచుతాం' అని హెచ్చరించారు.

# దౌత్యం అంటే టీ20లే కాదు.. టెస్టులూ ఉంటాయి!

మొదటిపేజీ తరువాయి
"అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘమైన, అనిశ్చిత ప్రక్రియలతో కూడుకున్నవి. భౌగోళిక రాజకీయ సమస్యలకు ప్రభుత్వాలు, మీడియా త్వరితగతిన పరిష్కారాలు కోరుకుంటాయి. కానీ వీటి పరిష్కారం సుదీర్ఘకాలంలో రూపుదిద్దుకుంటుంది. అదే సమయంలో టీ20 మాదిరి.. మీడియాకు స్వల్పకాలిక పరిణామాలను అందించాల్సిన అవసరం ఉంది. అయితే, వాస్తవ ప్రపంచంలో టెస్ట్ మ్యాచ్‌లూ ఉంటాయి. వాటి ఫలితాలు తక్కువ సమయంలో తేలిపోయేవి కావు. పశ్చిమాసియా యుద్ధం ఒక టీ20 మ్యాచ్‌లా ఉంటుందని అంతా భావించారు. కానీ అది ఏకంగా టెస్ట్ సిరీస్, అంతకంటే ఎక్కువ కాలం సాగే ప్రక్రియగా మారింది" అని పేర్కొన్నారు.

**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యలు, మార్కెట్ అంతరాయాలతో కూడిన నేటి అనిశ్చిత ప్రపంచంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల కోసం జైశంకర్ నాలుగు సూత్రాలను సూచించారు.**

- **అంతరాయాల నుంచి తమను తాము కాపాడుకోవడం వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా ఉండాలని చెప్పారు. 'డి-రిస్కింగ్' తన అతి పెద్ద మంత్రమని పేర్కొన్నారు.**
- **ఎక్కువ మంది భాగస్వాములు, అధిక సంఖ్యలో సరఫరా వనరులపై ఆధారపడాలని సూచించారు. ఎన్ని ఎక్కువ ఆప్షన్లు ఉంటే అంత సురక్షితంగా ఉంటారని తెలిపారు.**
- **ప్రపంచ మార్కెట్లు తరచూ భౌగోళిక రాజకీయాల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని అంగీకరించాలన్నారు. ఇంధనం, ఎరువులు, రవాణా వంటివి దీనికి ఉదాహరణలని తెలిపారు.**
- **అంతరాయాలు ఎప్పుడైనా కలగవచ్చని అంచనా వేసి.. ముందుగానే ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వైవిధ్యం పాటించి, పెట్టుబడులకు భద్రత కల్పించుకోవాలని చెప్పారు.**

# ఆరోగ్యం బాలేకపోతే.. చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు..! - రాజ్‌నాథ్‌సింగ్

మొదటిపేజీ తరువాయి
"ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచి పరిణామమే. కానీ ఇంటర్నెట్‌లో కనిపించిన సమాచారంతోనే రోగ నిర్ధారణకు రావడం సరైంది కాదు. స్వల్పంగా ఛాతినొప్పి వచ్చినా.. ఆన్‌లైన్‌లో వెతికి తీవ్రమైన గుండె జబ్బు ఉందని కొందరు భయపడుతున్నారు. అదే నొప్పి.. ఆందోళన, కండరాల సమస్యల వల్ల కూడా రావచ్చు. కొందరు రోగులు వారికి ఉన్న లక్షణాలు చెప్పకుండా.. ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేరును వైద్యుడికి చెబుతున్నారు" అని ఆయన అన్నారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు.. స్థానిక భాషలోని పదాలతో లక్షణాలను చెప్పడం కూడా వైద్యులకు సవాలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఛాతీలో 'దుక్ దుక్' గా ఉందని ఓ గ్రామీణుడు వైద్యుడికి చెప్పిన ఉదాహరణను ఆయన వివరించారు. వైద్య విద్యలో 'దుక్ దుక్' అనే లక్షణం గురించి ఎక్కడా ఉండదని చమత్కరించారు. యంత్రాలు శరీరంలో ఏం జరుగుతుందో గుర్తించగలవు.. కానీ రోగి మనసులోని భయం, ఆందోళనను అర్థం చేసుకోవడం వైద్యులకే సాధ్యమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.

# కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసుకు చిన్నారెడ్డి సమాధానం ఇదే..

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తనకు ఇచ్చిన నోటీసుకు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సమాధానం ఇచ్చారు. ఆగస్టు 16న చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి వ్యతిరేకంగా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. "ఏఐసీసీ, టీపీసీసీ కార్యాలయాలను పవిత్ర దేవాలయాలుగా భావించాను. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఖర్గే నాకు దేవుళ్లతో సమానం. అలాంటి వారికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రశ్నే లేదు, అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాదు.
ఈ రెండేళ్ల 8 నెలల్లో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అనుభవిస్తున్న బాధలు చెప్పాను. 40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తున్న నాయకుల మనోభావాలను వ్యక్త పరిచాను. ఎవరిపైనా అనుచిత వాఖ్యలు చేయలేదు. నాకు ఆ అలవాటు, అవసరం లేదు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో ముగించి ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని చిన్నారెడ్డి చెప్పారు.

# రానున్న ఐదు రోజులు వర్షాలు.. వాతావరణ శాఖ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి
ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, నల్గొండ, సూర్యాపేటలో వేగంగా బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.
అదే విధంగా కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని వాతావరణ శాఖ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది.


# కొండా సురేఖ సంచలన లేఖ!

మొదటిపేజీ తరువాయి
**అటు విచారణ.. ఇటు విమర్శలు**
పార్టీ క్రమశిక్షణ కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే.. తనపై బహిరంగంగా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలని సురేఖ కోరారు.
"పార్టీ క్రమశిక్షణపై నాకు పూర్తి గౌరవం ఉంది. అదే సమయంలో, ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన నాపై తీవ్ర మాటలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నా రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మీడియా ముందుకు రావడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలి" అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.
కాంగ్రెస్ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి ఉన్న పార్టీ అని, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ కోరారు.

# భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ!

మొదటిపేజీ తరువాయి
ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయి" అని కిషన్ రెడ్డి అన్నారు.

# మూసీ నది నీటి ప్రవాహంలో కొట్టుకు వచ్చిన గుర్తుతెలియని మృతదేహం..!



హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ మూసీ నదిలో గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. నది మధ్యలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, అది పురుషుడిదిగా గుర్తించారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై అంబర్‌పేట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.
హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో మూసీ నదిలో గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. శనివారం (ఆగస్టు 22) నది మధ్యలో మృతదేహం కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అంబర్‌పేట్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు.
మూసీ నదిలో ప్రవాహం మధ్యలో మృతదేహం ఉండటంతో దాన్ని బయటకు తీసేందుకు పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మృతదేహం ఓ పురుషుడిదిగా పోలీసులు భావిస్తున్నారు. అయితే మృతుడి వయసు, పేరు, చిరునామా తదితర వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. మృతుడి వివరాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఆయన ఎక్కడి నుంచి వచ్చారు? మూసీ నదిలోకి ఎలా చేరుకున్నారు? ప్రమాదవశాత్తూ నదిలో పడ్డారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు.
మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు పోలీసులు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల అసలు కారణంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు మూసీ నదిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను గుర్తించి సమాచారం అందించేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు.

# రూ. 150 కోట్ల అవినీతి : బార్ కౌన్సిల్ చైర్మన్‌పై సంచలన ఆరోపణలు




తెలంగాణాలోని నల్సార్ లా యూనివర్సిటీ 2026 విద్యార్థులపై చర్యల వివాదంలో భంగపడ్డ బీజేపీ ఎంపీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (BCI) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ న్యాయవాది, బీసీఐ కో-చైర్మన్ వై.ఆర్. సదాశివ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. చైర్మన్ మనన్ మిశ్రానాయకత్వంలో బీసీఏ ప్రతిష్ట, ప్రమాణాలు దిగజారిపోయాయని ఆరోపించారు.
మిశ్రా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆయనకు ఒక లేఖ రాయడం కలకలం రేపింది. ఈ సందర్భంగా ట్రస్ట్ పనితీరుపై కూడా రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. ఆ ట్రస్ట్ నిష్క్రియంగా మారిందని, కౌన్సిల్ నిధులలో సుమారు రూ. 150 కోట్లు కొత్తగా సృష్టించబడిన ట్రస్ట్‌కు మళ్లించారని ఆరోపించడం సంచలనంగా మారింది.
తక్షణమే లేదా కనీసం ఈ లేఖ అందిన 15 రోజుల్లోపు రాజీనామా చేయాలని సదాశివ రెడ్డి తన లేఖలో కోరారు. అలాగే తాను లేవనెత్తిన అంశాలను పరిశీలించడానికి BCI ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంబంధిత రికార్డులను ముందుగానే సభ్యుల ముందు ఉంచాలని కూడా ఆ లేఖలో కోరారు.

**నిధుల స్పెషల్ ఆడిట్**
బీసీఐ, బీసీఐ ట్రస్ట్ PEARL-First ఖాతాలపై కాగ్ (CAG - Comptroller and Auditor General of India) ప్యానెల్‌లోని స్వతంత్ర సంస్థతో ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ప్రతిపాదించారు. ట్రస్ట్ రిజిస్ట్రేషన్ నాటి నుండి ఇప్పటివరకు జరిగిన లావాదేవీలపై ఈ ఆడిట్ జరగాలని, ఆ నివేదికను సభ్యులందరికీ అందించడంతో పాటు బహిరంగపరచాలని కూడా యాన డిమాండ్ చేశారు. అలాగే లా కాలేజీలు, యూనివర్సిటీలు లేదా మేనేజ్‌మెంట్‌ల నుండి ఎలాంటి విరాళాలు, ప్రాసెసింగ్ ఫీజులు లేదా చెల్లింపులను బిసిఐ లేదా దానికి అనుబంధ ట్రస్ట్‌లు స్వీకరించకుండా తక్షణమే నిలిపివేయాలన్నారు.

### చైర్మన్‌పై సదాశివ రెడ్డి ప్రధాన ఆరోపణలు

» **బీసీఐలో నియామకాలను ఎటువంటి పారదర్శకమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ లేకుండానే చేపట్టారని ఆరోపించారు.**
» **బిసిఐ ట్రస్ట్‌ను నిష్క్రియం చేసి, దాదాపు రూ.150 కోట్ల కౌన్సిల్ నిధులను కొత్తగా ఏర్పాటు చేసిన ట్రస్ట్‌కు మళ్లించినట్లు పేర్కొన్నారు.**
» **అనుమతులు లేదా రెన్యూవల్స్ కోసం వచ్చే లా కాలేజీల నుండి నిరంతరం విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.**
» **బీసీఏ ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో కీలక పదవులను మనన్ మిశ్రా తన కుటుంబ సభ్యులకు కేటాయించారని విమర్శించారు.**
» **నాల్సార్ లా యూనివర్సిటీ గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌పై సరైన ఆధారాలు లేకుండానే బిసిఐ చర్యలు తీసుకుందని ప్రశ్నలు లేవనెత్తారు.**
» **రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో గ్రూపులు మరియు వర్గపోరును ప్రోత్సహిస్తున్నారని కౌన్సిల్ నాయకత్వంపై ఆరోపణలు చేశారు.**

# ఎద్దుకు అంతిమ సంస్కారాలు.. బోరున ఏడ్చిన రైతు

అన్నదాతకు కన్నీళ్లు మిగిలిచ్చింది ఓ దుక్కిటెద్దు. ఎద్దు పాముకాటుకు గురై మరణించింది. దీంతో రైతు బోరున విలపిస్తున్నాడు. వరంగల్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. పశువైద్య సిబ్బంది బ్రతికించాలని ప్రయత్నం చేసినా సక్సెస్ కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు చూస్తే..



అన్నదాతకు దుక్కిటెద్దే కుడి భుజం.. ఆ ఎద్దుతో అరకకట్టి నాగలిదున్నితేనే నాలుగు మెతుకులు నోటిలోకి పోతాయి. వరంగల్ జిల్లాలో ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో దుక్కిటెద్దు పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయింది.. పాముకాటుకు గురైన ఎద్దు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో ఆ రైతు బోరున విలపించాడు..మృతి చెందిన ఎద్దుకు అంతిమ సంస్కారాల నిర్వహించారు. ఈ విషాద సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం శివాజీనగర్ గ్రామంలో జరిగింది. సంజీవ్ అనే రైతు తన పొలంలో వ్యవసాయ పనులు నిమగ్నం అయ్యాడు. తన జోడెద్దులను పొలం వద్దే కట్టేశాడు. అదే సమయంలో తన దుక్కిటేద్దును పాము కాటేసింది. పాము కాటేసి పరుగులు పెడుతున్న దృశ్యాలు గమనించిన ఆ రైతు.. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వైద్య సేవలు అందించెలోపే ప్రాణాలు కోల్పోయింది. దుక్కిటేద్దు ప్రాణాలు కోల్పోవడంతో రైతు సంజీవ్ బోరుణ విలపించాడు. మృతిచెందిన ఆ ఎద్దును ఖననంచేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు..

# జూబ్లీహిల్స్ రిచ్‌కిడ్స్ కేసులో బిగ్ అప్‌డేట్.. మీనాకుమారికి కస్టడీలో వెలుగోకి కీలక విషయాలు!

సాధారణంగా పిల్లలకు మంచి మాటలు చెప్పే తల్లులను చూసి ఉంటారు, అలాగే పిల్లలు చెడు దారిలో వెళ్తే వారిని సరిదిద్దే తల్లిదండ్రులను చూసి ఉంటారు. కానీ ఇక్కడో తల్లి మాత్రం తానే పక్కనుండి పిల్లలతో నేరాలు చేయించడం మొదలుపెట్టింది. తమ పిల్లల సహాయంతో బాగా డబ్బున్న వారి పిల్లలను లక్ష్యంగా చేసుకుని డబ్బులు కాజేసేది. ఈ విషయం కాస్త పోలీసుల దృష్టికి వెళ్లడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆమెతో పాటు తన ఇద్దరు కుమారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.జూబ్లీహిల్స్‌లో బాగా డబ్బున్న వ్యక్తుల పిల్లలే లక్ష్యంగా తమ కొడుకులను రంగంలోకి దించి, వారితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు తీసుకొని వాటితో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న ఓ ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితురాలైన మీనాకుమారిని రెండు రోజుల కస్టడీకి తీసుకున్న పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. కోర్టు ఆదేశాలతో శుక్రవారం ఆమెను ప్రశ్నించిన విమెన్ సేఫ్టీ పోలీసులు.. విచారణలో మైనర్లను ట్రాప్ చేసిన విధానం, బ్లాక్‌మెయిల్ వ్యవహారాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. కస్టడీ ముగియడంతో మీనాకుమారిని ఈరోజు సాయంత్రం కోర్టులో హాజరుపరచనున్నారు.సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేసి సంపన్న కుటుంబాలకు చెందిన మైనర్లను బుట్టలో వేసుకున్నట్లు మీనాకుమారి కుమారులు ఆజాద్, రాజీవ్‌లపై ఆరోపణలు ఉన్నాయి. మైనర్లతో సన్నిహితంగా ఉన్న సమయంలో వారికి తెలియకుండానే ఆజాద్ రహస్యంగా వీడియోలు చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలను తన తల్లి మీనాకుమారికి పంపినట్లు దర్యాప్తులో తేలింది.

# భూ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో నిర్లక్ష్యం

**భీమదేవరపల్లి, ఆగస్ట్ 22, (విజన్ ప్రభ,)**
హనుమకొండ జిల్లా,భీమదేవరపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీంతో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ ఆరోపించారు.
తహసీల్దార్, డీటీ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో కార్యాలయానికి వచ్చే రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సిబ్బంది ఉదయం 10 గంటలకే కాకుండా 11.30 గంటల సమయంలో కూడా కార్యాలయానికి వస్తున్నారని ఆరోపించారు.
వంగర గ్రామానికి చెందిన ఓ రైతు తన తండ్రి మరణానంతరం వారసత్వంగా రావాల్సిన భూమి కోసం



దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సంబంధిత విరాసత్ ఫైలు సుమారు రెండేళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదని వెంకటస్వామి మాదిగ తెలిపారు. ఆ ఫైలును ఆర్డీవో కార్యాలయానికి రెండుసార్లు పంపగా రెండుసార్లు తిరస్కరణకు గురైందని, మూడోసారి అవసరమైన విధంగా పంపాలని కోరినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు.
స్లాట్‌ను మూడుసార్లు బుక్ చేసుకోవాల్సి రావడంతో సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోతున్నట్లు ఆయన తెలిపారు. ఫైలు ముందుకు కదలాలంటే కింది స్థాయి సిబ్బంది డబ్బులుఅడుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారని, తమ వద్ద డబ్బులు లేవని చెప్పి తహసీల్దార్‌ను పలుమార్లు వేడుకున్నా ఫైలు కదలడం లేదని పేర్కొన్నారు.రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలు పరిష్కరించాలి. అవినీతి ఆరోపణలపైఉన్నతాధికారులు విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాలి" అని మాట్ల వెంకటస్వామి మాదిగ స్పష్టం చేశారు.

# హత్య గావించబడిన ఉపాధ్యాయురాలికి నివాళి.




**నడిగూడెం ఆగస్టు 22 (విజన్ ప్రభ)**
నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం ప్రాథమిక పాఠశాల-2 లో శనివారం నల్ల బ్యాడ్జీలతో నల్గొండలోహత్యగావించబడిన ప్రిన్సిపల్ రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఉపాధ్యాయులు మౌనం పాటించారు. అనంతరం పాఠశాలప్రధానోపాధ్యాయులు బుర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడిలో గురువులే కాకుండా, ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా పిల్లలకు క్రమశిక్షణ, భయం, భక్తితో పాటు, సమాజం పట్ల, పెద్దల పట్ల, మర్యాదను నేర్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు సుజాత, జ్యోతి, ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ అనూష, పాఠశాల సిబ్బంది రసూల్, మణెమ్మ, చందన, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 22 (విజన్ ప్రభ)**
యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి లడ్డు ప్రసాదాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ కి అందజేశారు.అనంతరం ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మంత్రిదృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహసానుకూలంగా స్పందించి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

# మచ్చగిరి గుట్ట నుండి దిల్ సుఖ్ నగర్ కు నూతన బస్సు ప్రారంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 22 (విజన్ ప్రభ)**
వలిగొండ: మండల పరిధిలో ని మత్స్యగిరి గుట్ట నుండి దిల్ సుఖ్ నగర్ కు నూతన బస్సు ను ప్రారంభించిన మచ్చ గిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ వారు మాట్లాడుతూ మచ్చ గిరి గుట్టకు వచ్చే భక్తులకు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని డిపో అధికారులకు అర్జి పెట్టుకోగా నూతన బస్సు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ డైరెక్టర్లు కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించి బస్సును ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మహిళలు ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పెద్ది చంద్రమౌళికి కాంగ్రెస్ నాయకుల నివాళి

**తొర్రూరు, ఆగస్టు 22, (విజన్ ప్రభ,)**
తొర్రూరు మండలం ఫతేపురం గ్రామానికి చెందిన పెద్ది చంద్రమౌళి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ



నాయకులు జక్కన్న మహబూబ్ రెడ్డి, జక్క ఇంద్రసేనారెడ్డి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు చంద్రమౌళి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫతేపురం గ్రామ సర్పంచ్ ఇట్టే మాధవరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇట్టే ప్రభాకర్ రెడ్డి, వెన్నం సోమిరెడ్డి, ఇట్టే మహేందర్ రెడ్డి, పెద్ది రవి, పెద్ది ప్రవీణ్, మహంకాళి సంపత్, యర్రం రాజు యాదవ్, పెద్ది సాగర్, పెద్ది సంపత్, పెద్ది వీరభద్రయ్య, సతీష్, సుమన్, సాయి తదితరులు పాల్గొని చంద్రమౌళికి నివాళు లర్పించారు.

# "మేతకు వెళ్లి విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి"



**అనంతగిరి : ఆగస్టు 22 (విజన్ ప్రభ)**
అనంతగిరి:మేతకు వెళ్లిన పాడి గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్ఫారంవిద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం రంగయ్య గూడెం గ్రామంలో చోటుచేసుకుంది.
రంగయ్య గూడెంకు చెందిన పప్పుల సీతారామయ్య కు చెందిన పాడి గేదె శనివారం అమీనాబాద్ పొలాల వద్ద మేతకు వెళ్లింది. పొలాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లిన సమయంలోప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.ఈ గేదె రోజుకు సుమారు 6 లీటర్ల 8 లీటర్లు పాలు ఇస్తుందని, దీని విలువ దాదాపు రూ. 1,50,000 రూపాయలు వరకు ఉంటుంది ఈమధ్యనే కొనుగోలు చేసాం అని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుతో తెలిపారు. పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు తీరని నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.మృతి చెందిన గేదెకు నష్టపరిహారం అందించాలని అధికారులు , వారు కోరారు

# ఇందుకూరుపేట లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**దేవీపట్నం ఆగస్టు 22 (విజన్ ప్రభ)**
దేవీపట్నం: మండల కేంద్రంలో ఇందుకూరుపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ సల్మాన్ రాజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర 3 వ శనివారం సింగల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అనే కార్యక్రమం పై స్కూల్




విద్యార్థులు తో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తమ సిబ్బందితో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు సల్మాన్ రాజు మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం పరిసరాలు పరిశుభ్రత స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంనిర్వహిస్తున్నట్లు తెలిపారు మన గ్రామంలో మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని అది ప్రతి ఒక్కరు గమనించాలని వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈనియమాలు తప్పనిసరిగా పాటించాలని ప్రతి ఒక్కరు బాధ్యతని మరోసారి కోరారు ఈ కార్యక్రమం లో పలువురు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించిన కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు

**చిలుకూరు ఆగస్టు22 ( విజన్ ప్రభ)**



చిలుకూరు మండల పరిధిలోనిజగ్రిపోతులగూడెం ఎస్సార్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు భీమ్లా హేమ్లా కుమారుడు అనారోగ్యంతో/ బాధపడుతున్న విషయం తెలుసుకున్నమండల పార్టీ అధ్యక్షులు కిత్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పింద్రాతి హనుమంతరావు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, విజయలక్ష్మి బానోతు అనూష రవికుమార్, బానోతు కృష్ణ నాయక్, విజయలక్ష్మిచంద్రు నాయక్, శైలజ లక్ష్మీనారాయణ బొడ్డుపల్లి లక్ష్మీ బిక్షం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భాను నాయక్, మోహనరావు, మురళి, సుదర్శన్ రెడ్డి, నాకు సత్యనారాయణ రెడ్డి, తోట నాగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను భయపెట్టి చదివించకండి బట్టు. సంతోష్.

**చిలుకూరు ఆగస్టు 22 (విజన్ ప్రభ )**

చిలుకూరు:పాఠశాల అంటే దేవాలయం "బడి" అంటే భయం కాదు..పిల్లల కు అనురాగం కావాలి!
హోమ్ వర్క్ చేయలేదనే భయం,పసి మనసుపై పడిన వత్తిడి. బడిలో
శిక్షలు కాదు.భద్రత కావాలి.పిల్లలని భయపెట్టి చదివించకండి.ప్రతి తరగతి గది ఒక సురక్షితమయిన ప్రదేశం కావాలి.విద్య జ్ఞానాన్ని,వినయాన్ని,వివేకాన్ని పెంచాలి.కానీ నేటి విద్య ఒత్తిడి మార్కుల వేట? ఒక్కసారితల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు, మేధావులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మీ భట్టు సంతోష్ తోళా నాయక్

# పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అడ్డా

**- పరకాల నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్**

**- అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం....**

**- గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారు.**

శనివారం గాంధీభవన్ నుంచి పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజలకే అని అన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం దాదాపు



88,384 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రతి నెల 1832.06 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. నూతన రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా 18,365 మంది చేరారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం అని,గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారని అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హతను బట్టి వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల గృహ జ్యోతి కింద పంపిణీ చేస్తున్నాము.500 గ్యాస్ పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలో కుట్టుమిషన్ల పంపిణీ బి ఆర్ఎస్ నాయకులు ఎన్ని ఊసరవెల్లి రాజకీయం చేసిన ఎగిరేది పరకాల గడ్డమీద రేవూరి జెండా 10 సంవత్సరాల ప్రభుత్వంలో ఒక రేషన్ కార్డు ఇయ్యకుండా ఏ మొఖం పెట్టుకొని ఓటర్ల దగ్గరికి పోయి ఓట్ల అడుగుతారు నేను ప్రశ్నిస్తున్న? ఇప్పటికైనా కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆలోచించి విమర్శలు మానుకొని ప్రజల గురించి ఆలోచించాలని పత్రికాముఖంగా నేను తెలియజేస్తున్నా.

# పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు.....

**- కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్**

శ్రావణమాసం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుషాయిగూడ డిపో నుండి వివాహాది శుభకార్యములకు విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన తక్కువ ధరలలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే రాష్ట్రంలోని మరియు ఇతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గోవా, మధ్యప్రదేశ్,మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు కూడా ప్రత్యేక బస్సులు నడపబడుతున్నవని తెలియజేశారు.కనీసం 30 మంది ప్రయాణికులు ఉన్నట్లయితే వారు కోరుకున్న చోటకి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. అంతేకాకుండా కుషాయిగూడ డిపో నుండి అంతర్రాష్ట్ర సర్వీసులకు రిటర్న్ జర్నీ టికెట్ బుక్ చేసుకుంటే వారికి టికెట్ చార్జీలో10% రాయితీ ఇస్తున్నట్లు తెలియజేశారు తిరుపతి, గుంటూరు, అమలాపురం,

TGTEL/26/A1984 VISION PRABHA
విజన్‌ప్రభ
తెలుగు దినపత్రిక



# గుండె నిండా అభిమానం, మాటల్లో చెప్పలేనంత ప్రేమ: చిరుకు ప్రముఖుల విషెస్

చిరునవ్వుతో ప్రేక్షకుల్ని గెలిచి.. స్టెప్పులతో థియేటర్లను ఊపేసి.. యాక్షన్‌తో అభిమానుల్లో పూనకాలు తెప్పించిన చిరంజీవి.. తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయం రాసుకున్నారు. నేడు ఈ అగ్రకథనాయకుడి పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఆయన సినిమా అప్‌డేట్స్, సినీప్రముఖుల విషెస్‌తో నిండిపోయింది. ఇక, అన్నయ్యతో ఉన్న అనుబంధాన్ని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అందరికీ ఆయన మెగాస్టార్ అయితే.. తనకు మాత్రం 'ఏకైక హీరో' అని కొనియాడారు.మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను, ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్‌గా నిలిచారు. రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని తన బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో చేసుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. – ఏపీ సీఎం చంద్రబాబు

భారతీయ సినిమాకు, కళారంగానికి మీరు అందిస్తున్న సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో ఆదర్శం. మీరు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. పుట్టినరోజు శుభాకాంక్షలు చిరంజీవి గారు. – కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మెగాస్టార్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ అద్భుతమైన ప్రస్థానం, తెలుగు సినిమాకు మీరు అందించిన చిరుసేన సేవ, సమాజ సేవ పట్ల మీకున్న నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. మరెన్నో సంవత్సరాలు విజయవంతంగా సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాం. జన్మదిన శుభాకాంక్షలు, చిరంజీవి. – నారా లోకేశ్

హ్యాపీ బర్త్‌డే డియర్ చిరంజీవి! ఎప్పుడూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను: వెంకటేశ్



ఏకైక మెగాస్టార్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మా అందరికీ ఆయనే అతిపెద్ద అండ.

మమ్మల్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టి, మాకెంతో స్ఫూర్తినిచ్చారు: అల్లు అర్జున్

ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది చిరంజీవే. ఆయన పంచే ప్రేమ, బాధ్యత మా అందరికీ స్ఫూర్తి. – అన్నా కొణిదెల

పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న.. ఎప్పుడూ మీరే నాకు ఆదర్శం. – వరుణ్ తేజ్

చిత్ర పరిశ్రమలో ఏదో సాధించాలనే ఆశతో అడుగుపెట్టే ప్రతి యువకుడి కలను డిజైన్ చేసింది మీరే. వి లవ్ యూ సార్.. హ్యాపీ బర్త్‌డే. – నాని

హ్యాపీ బర్త్‌డే అన్నయ్య: రవితేజ

ప్రతి కొడుకుకి తన తండ్రి ఒక చిరంజీవి (శాశ్వతం). చిరంజీవి అనే పేరు ప్రతి ఇంటిలో భాగమైపోయింది. నా సుప్రీమ్ హీరో చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు. – సాయిధరమ్ తేజ్

చిన్నప్పుడు ఎవరైనా హీరోయిక్‌గా ఏమైనా చేస్తే.. వెంటనే 'చిరంజీవి అనుకుంటున్నావా?' అనేవారు. హీరో అంటే చిరంజీవే. హ్యాపీ బర్త్‌డే బాస్. ఎప్పటికీ ఇలానే మమ్మల్ని అలరించాలి. – త్రివిక్రమ్

మీరంటే గుండె నిండా అభిమానం, మాటల్లో చెప్పలేనంత ప్రేమ.. లవ్ యూ అన్నయ్య – దర్శకుడు బాబీ

"హ్యాపీ బర్త్‌డే మెగాస్టార్. మీరు ఎప్పటికీ మాలో స్ఫూర్తినింపుతూనే ఉంటారు " – దర్శకుడు వశిష్ఠ

"మన అందరి మెగాస్టార్.. అన్నయ్య చిరంజీవికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు" – దర్శకుడు మెహర్ రమేశ్

చిరంజీవి అంటే.. 90০ కిడ్స్‌కు ఊపు.. జెన్‌జీకి వైబ్!

మెగాస్టార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి. మరెన్నో గొప్ప విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. – నారా రోహిత్

చిరంజీవిలా ఇంకొకరు లేరు.. మరొకరు రాబోరు.. భూమి ఒక్కటే, సూర్యుడొక్కడే.. అలానే చిరంజీవి కూడా. – శ్రీకాంత్

చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఎప్పుడూ మాకు స్ఫూర్తిదాయకం. ఆయనపై ఎప్పటికీ ప్రేమ, గౌరవం ఉంటాయి: బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి

## ఒక్క లైక్.. 'స్పిరిట్' వివాదంపై దీపికా స్పందనిదే!



ప్రభాస్ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రానున్న చిత్రం 'స్పిరిట్' . ఈ సినిమా నుంచి దీపికా పదుకొణె వైదొలగడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. తాజాగా సందీప్ సోదరుడు ప్రణయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆమె ప్రాజెక్ట్‌ను నుంచి వెళ్లిపోవడానికి కారణాన్ని పంచుకోవడంతో ఈ విషయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.దీపిక ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాన్ని ప్రణయ్ వివరించారు. తన డేట్స్ సర్దుబాటు చేయడంతో పాటు దీపిక భారీ పారితోషికం అడిగారని చెప్పారు. అలాగే సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని తెలిపారు. ఈ కామెంట్స్ ఒక్క రోజుల్లోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాయి. తాజాగా దీనిపై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేసి తన స్పందనను పరోక్షంగా తెలిపారు. "ఒక మహిళ ఇలాంటి డిమాండ్‌లు చేస్తే సహించలేకపోతున్నారు. ఆమె నో చెప్పడం వల్ల ఈగో సమస్యలు వచ్చాయి. ఇది కేవలం పురుషాధిక్య అహంకార సమస్య మాత్రమే" అని ఇన్‌స్టాలో ఒకరు పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేయడం ఇప్పుడు వైరల్ అవుతోంది.హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' లో మొదట దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. అయితే ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రీని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.



## 'హాయ్'... దేవసేన

"నన్ను ఒకమ్మాయి వద్దని వెళ్లిపోయిందమ్మా" అంటున్నాడు ఓ యువకుడు. "ఎవరురా నిన్ను వద్దనేది.. ఆమె ఏమయినా మిస్ వరల్డ్ అనుకుంటుందా?" అని తన కొడుకుని అడుగుతుంది తల్లి. మరి ఇంతకీ ఈ అబ్బాయిని కాదన్న ఆ మిస్ వరల్డ్ ఎవరో తెలుసుకోవాలంటే 'హాయ్' సినిమా చూడాల్సిందే. కథానాయిక నయనతార, కవిన్ జంటగా నటించిన చిత్రమిది. విష్ణు తెరకెక్కించారు. ఈ నెల 28న రానుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ఊర్లో అందరికీ రకరకాల సమస్యలు ఉన్నాయి. కానీ నువ్వేంటి ఒక అమ్మాయి లవ్ చేయలేదని చచ్చిపోతానంటున్నావ్" అంటూ సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల్లో నవ్వులు పూయిస్తుంది. ఇందులో దేవసేన పాత్రలో కనువిందు చేయనుంది నయన్. రొమాంటిక్ కామెడీ డ్రామాగా తీర్చిదిద్దిన ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, కె.భాగ్యరాజ్, ప్రభు తదితరులు కీలక పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ది రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి.

## ఆరోజు అన్నయ్య దూరమవుతాడేమోనని ఏడ్చాను: పవన్ కల్యాణ్

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భావోద్వేగ పోస్టు పంచుకున్నారు. పలు ఆసక్తికర విషయాలను ఆయన గుర్తుచేసుకున్నారు."కాలేజీ చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు. వేసవి సెలవులకు ఆయన ఇంటికి రావడం మాకు ఒక పండగలా ఉండేది. తిరిగి కాలేజీకి వెళ్లేటప్పుడు ఎంతో బాధపడే వాళ్లం. ఆయన మళ్లీ సెలవులకు వచ్చే వరకు ఇంట్లో ఆ సందడి ఉండేది కాదు. నేను స్కూల్లో చదివే రోజుల్లో అన్నయ్య పక్కన నడవడం కూడా నాకు గర్వంగా ఉండేది. ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి పక్కన నడుస్తున్నానని భావించే వాడిని. ఆయన హీరో కాకముందే నాకు హీరో. నేను ఆయనకు అభిమానిని. షూటింగ్‌ల కోసం ఇతర దేశాలు వెళ్లినప్పుడు ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. ఎప్పుడూ మా సంతోషాన్నే కోరుకుంటాడు" "అన్నయ్యకు పెళ్లి అయినప్పుడు ఎక్కడ మాకు దూరమవుతారేమోనని భయపడి ఒక గదిలో నిశ్శబ్దంగా ఏడ్చాను. అప్పుడు ఆయన వదినను నా దగ్గరకు తీసుకువచ్చి.. 'రా.. ఈరోజు నీకు ఒక పెద్ద మనిషిని పరిచయం చేస్తాను' అన్నారు. నేను ఎందుకు ఏడుస్తున్నానో చూసి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. అప్పటి నుంచి వాళ్లిద్దరూ నాపై చూపిస్తున్న ప్రేమను చెప్పడానికి నాకు పదాలు సరిపోవు. అన్నయ్య ఎన్నోసార్లు షూటింగ్‌లలో గాయపడ్డాడు. చెన్నై వేడి,



ఉక్కపోతలో 18 గంటల కష్టపడి పనిచేసి.. అర్ధరాత్రి నిలబడటానికి కూడా ఓపిక లేని స్థితిలో ఇంటికి వచ్చేవాడు. ఆయన కష్టంపై ఆధారపడి బతుకుతున్నందుకు అప్పుడు చాలా బాధపడేవాడిని. ఎప్పుడూ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. నాకు ఆయన మాత్రమే హీరో" అంటూ చిరుకు విషెస్ చెప్పారు.

**కల్యాణ్ బాబూ.. నువ్వు నాక్కూడా స్ఫూర్తిగా నిలిచావు: మెగాస్టార్**

తన సోదరుడు పవన్ కల్యాణ్ పంచుకున్న భావాలపై చిరంజీవి భావోద్వేగంతో స్పందించారు. "ప్రియమైన కల్యాణ్ బాబూ.. నీ మాటలు మన జీవితంలోని అత్యంత విలువైన అధ్యాయాలను మరోసారి గుర్తుకు తెచ్చి భావోద్వేగానికి గురిచేశాయి. నువ్వు ప్రస్తావించిన నా ప్రేమ, త్యాగాలు వాస్తవానికి మీ అన్నయ్యగా అవి నా బాధ్యత, ఆప్యాయతలు. ఇప్పుడు ప్రజల కోసం నువ్వు చూపుతున్న అచంచల ధైర్యం, పట్టుదల, మన భారతదేశం పట్ల నీకున్న ప్రేమను చూస్తుంటే, నాకెంతో గర్వంగా ఉంది. కొన్ని లక్షల మందికి నువ్వే బలంగా, స్ఫూర్తిగా మారావు. నువ్వు నన్ను నీ హీరో అంటావు కానీ, నీ నిజాయతీ, పట్టుదల, నిస్వార్థమైన ప్రయాణం నన్ను కూడా ఎన్నో విధాలుగా స్ఫూర్తిపొందేలా చేశాయి. ఈ అందమైన జ్ఞాపకాల కానుకను ఇచ్చినందుకు ధన్యవాదాలు. కల్యాణ్ బాబూ, నీ ప్రేమ నా జీవితంలో లభించిన గొప్ప ఆశీర్వాదాల్లో ఒకటి. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను" అని చిరంజీవి స్పందించారు.

## రామోజీ ఫిల్మ్ సిటీలో 'డేవిడ్ రెడ్డి' యాక్షన్



'డేవిడ్ రెడ్డి'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు మంచు మనోజ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాని హనుమా రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్నారు. భరత్ మోటుకూరి, వెంకట్ రెడ్డి నల్ల గంగుల నిర్మిస్తున్నారు. మరియా ర్యాబోషాప్కా కథానాయిక. ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. దాదాపు నెల రోజులుగా సాగుతున్న ఈ షెడ్యూల్‌లో భాగంగా బాలీవుడ్ నటి సౌండస్ మౌఫకీర్‌పై ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికి శ్రష్టి వర్మ నృత్యరీతులు అందిస్తున్నారు. అలాగే మరోవైపు మనోజ్, సముద్రఖని, రమ్యకృష్ణలపై కీలక క్లైమాక్స్ ఫైట్‌ని చిత్రీకరిస్తున్నారు. ఈ పోరాట ఘట్టం చాలా కొత్తగా, ఆసక్తికరంగా ఉంటుందని.. దీనితో పాటు ప్రత్యేక గీతం సినిమాకి ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇది 1897–1920 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగే ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. ఇందులో మనోజ్ శక్తిమంతమైన యోధుడిలా.. సరికొత్త లుక్‌లో అలరించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, ఫైట్స్: సుప్రీమ్ సుందర్, వింగ్ చున్ అంజి, కూర్పు: ఉజ్వల్ కులకర్ణి, ప్రొడక్షన్ డిజైన్: తాళ్లూరి కృష్ణ మోహన్, ఛాయాగ్రహణం: వేణు ఆచార్య.

Printing Press Address:SUNDAY PRINTING PRESSFlat No. 363 B, 1st Floor,Madhavaram Nagar Colony,Rangareddy, Telangana – 500072.Editor's Address:D. No: 1-143/1,Ananthagiri,Suryapet, Telangana – 508206.